క్లుప్తంగా

11న సెమీ క్రిస్మస్ వేడుకలు

కడప కల్చరల్ : జిల్లా ఇండిపెండెంట్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శుల ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 6.30 గంటలకు సమైక్య సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించనున్నట్లు పాస్టర్లు డేనియల్ కృష్ణదాస్, షద్రక్‌రాజు, మల్లెం విజయభాస్కర్, దేవిడ్‌రాజ్, పుల్లూరు శ్రీనివాసులు, శ్యాముల్‌బాబు, పి.మహేష్ తదితరులు తెలిపారు. శనివారం ప్రకాశ్‌నగర్‌లోని సీబీటీసీ ప్రార్థనా మందిరంలో విలేకరులతో వారు ఈ విషయం తెలియజేశారు. నగరంలోని స్టార్ ఫంక్షన్ హాలులో ఈ వేడుకలు నిర్వహిస్తామని, ఇండిపెండెంట్ పాస్టర్లు, సంఘాల సభ్యులు, క్రైస్తవ ప్రముఖులు హాజరు కావాలని కోరారు.

తగ్గిన టమాటా ధర



కడప అగ్రికల్చర్: కడప రైతు బజార్‌లో గత రెండు రోజుల నుంచి టమాటా ధరలు తగ్గుముఖం పట్టాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నాణ్యత దెబ్బతినడంతో ధర తగ్గిందని తెలిసింది. వారం క్రితం కిలో రూ. 30 ధర పలికిన టమాట శనివారం నాడు కిలో రూ. 16 చేరింది. వీటితోపాటు మిరపకాయలు, క్యాబేజీలు కిలో రూ. 20, బీరకాయ, వంకాయలు కిలో రూ. 30, బెండకాయ, మట్టికాయ, కాకరకాయ, దోసకాయ, దొండకాయలు కిలో రూ. 40, అనపకాయ, కాలీఫ్లవర్‌లు కిలో రూ. 45, చిక్కుడు, అలసంద కిలో రూ. 50 ధర పలుకుతున్నాయి.

రక్తదాన శిబిరం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలోని ఇందిరా భవన్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ మాజీ జాతీయ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు విష్ణుప్రీతం రెడ్డి, నాయకులు నజీర్ అహ్మద్, చార్లెస్ పాల్గొన్నారు.

నేడు సమావేశం

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్తు(ఆర్‌జేయూపీ) రాష్ట్ర విస్తృత సమావేశాన్ని కడపలోని శ్రీపసుపులేటి భుజంగరావు ఆర్‌జేయూపీ టీచర్స్ హోంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుదిబండ శ్రీనివాసులు, ఓబుల్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్, ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, సంఘం సీనియర్ నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయ, ఉద్యోగ స్థితిగతులు, సమస్యలపై సమీక్ష జరుగుతుందని, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రత్నాల సీమ కోసం ఉద్యమిద్దాం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: తరతరాలుగా మోసపోతున్న రాయలసీమను రత్నాల సీమగా మార్చు కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉద్యమించాలని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎన్. రవి శంకర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆర్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఆర్‌సీపీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తర తరాలుగా రాయలసీమను మన పాలకులు మోసం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు మగ్బూల్ బాష, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు పేర్కొన్నారు. శనివారం నగరంలోని హోచిమన్ భవన్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చదువు పేరుతో విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేయడం తగదన్నారు. ప్రైవేట్, కార్పొరేటు విద్యా సంస్థలు ప్రభుత్వం సెలవులు ప్రకటించినా తరగతులు నిర్వహిస్తున్నాయని ఆరోపించారు.

హక్కుల పరిరక్షణకు కృషి



సామాజిక సేవలందించిన వారిని సత్కరిస్తున్న అహ్మద్‌బాషా తదితరులు

కడప కార్పొరేషన్: మానవ హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరముందని హరూన్ గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్‌బి అహ్మద్‌బాషా అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక గోల్డెన్ సంఘం ఫంక్షన్ హాలులో సామాజిక సేవలందించిన పలువురిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మైనార్టీస్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ సలహాదారు ముఫ్తీ సయ్యద్ మహమ్మద్ అలీ బాగ్దాది, ఏపీ స్టేట్ మైనార్టీస్ కమిషన్ సభ్యులు ఎస్. హిదాయతుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకుడు బసవరాజు, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇబ్రహీం పాల్గొన్నారు.

శరణమంటిమయ్యా... శబరిగిరీశా..



- పెరిగిన అయ్యప్ప భక్తులు
- ప్రారంభమైన యాత్రలు

కడప కల్చరల్ : కార్తీకమాసం ప్రారంభానికి ముందునుంచి లక్షలాది మంది భక్తులు హరిహర సుతుడు అయ్యప్ప దీక్షా మాలను ధరిస్తారు. మండలం రోజులపాటు కఠిన నియమాలతో స్వామిని అర్చిస్తారు. మాలధారణ తమ జీవిత శైలినే మార్చేస్తుందని గాఢంగా నమ్ముతారు. శబరిమలకు వెళ్లి స్వామి అయ్యప్పను దర్శించుకునే రోజుకోసం ఎదురు చూస్తారు. నేడు ధనికుల నుంచి రోజువారి కూలీ పనులు చేసుకునే వారి వరకు అయ్యప్ప దీక్షలు వహిస్తున్నారు. కానీ దిగువ మధ్యతరగతి, పేదలు పెరుగుతున్న ఖర్చులు భరించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలం రోజులపాటు పూజలు నిర్వహించడం కాస్త ఖర్చుతో కూడిన పని కాగా, శబరిమలకు వెళ్లి స్వామిని దర్శించుకునేందుకు రోజురోజుకు ఖర్చు పెరుగుతుండడం వారికి ఇబ్బందిగా మారింది. అయినా స్వామిపై ఎనలేని భక్తి ఉండడంతో యాత్రలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి.

మాలధారణ

ఈ సీజన్‌లో ఇప్పటికే అయ్యప్ప దీక్షలు ప్రారంభం కావడం...దాదాపు 30 శాతం మంది దీక్షలు ముగించేందుకు శబరిమలకు వెళ్లడం, మరికొందరు వీటైనంతవరకు ధనుర్మాసం లోపలే స్వామి దర్శనం చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కార్తీకమాసం ప్రారంభంనుంచి దేవాలయాలలో గురుస్వాములు భక్తులకు మాలధారణ చేయించి దీక్ష వహింపజేశారు. భక్తుల్లో కొందరు ఇప్పటికే శబరిమల యాత్రకు వెళ్లగా, మరికొందరు రైళ్లు, బస్సుల్లో రిజర్వేషన్ చేసుకున్నారు. నూతన భక్తులు శబరిగిరిని దర్శించుకోవాలన్న కోరికతో తక్కువ సమయమైనా వారం రోజుల దీక్ష స్వీకరించి కొండకు బయలుదేరుతున్నారు. మరికొందరు కొండపై అడుగు పెట్టినా పుణ్యమేనన్న భావనతో మహిళలు సైతం దీక్షధారులైన తమ భర్తతో కలిసి యాత్రకు బయలుదేరుతున్నారు. ఈ ఏడాది అయ్యప్ప భక్తుల సంఖ్య దాదాపు ఐదు శాతం పెరిగినట్లు అంచనా. ఈ దీక్ష చేయడం ద్వారా శారీరక ఆరోగ్యంతోపాటు మనో వికారాలు తొలగి ఆత్మప్రక్షాళన అవుతుందని, దీక్ష అనంతరం నైతిక విలువలతో కూడిన జీవితాన్ని గడిపేందుకు అవకాశం ఉండడంతో భక్తుల సంఖ్య నానాటికి పెరుగుతోంది.

ధరలు పెరిగినా... జడవకుండా..

ఇటీవలి కాలంలో అయ్యప్ప దీక్ష కోసం అవసరమైన వస్తువుల ధరలు కూడా బాగా పెరిగాయి. సీజన్‌లో మండలం రోజులపాటు ఒక భక్తుడు మనసు తీరా సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి బస్సులో మిగతా అయ్యప్పలతోపాటు ఇతర పుణ్యక్షేత్రాలు దర్శించుకుంటూ శబరిమలకు వెళ్లి స్వామి అయ్యప్పను దర్శించుకునేందుకు రూ. 15–25 వేలకు పైగా ఖర్చవుతోంది. ఈ ఖర్చు క్రమంగా సామాన్య ప్రజలకు అందనంత స్థితికి వెళుతోంది. చూడవలసిన ఆధ్యాత్మిక ప్రాంతాల సంఖ్య పెరిగేకొద్దీ యాత్రకోసం అధిక మొత్తంలో వెచ్చించాల్సి వస్తోంది.

ఖర్చు ఎక్కువైనా..

అయ్యప్ప స్వామి దీక్ష అంటే ఖర్చు కూడా ఎక్కువ అవుతుంది. ప్రతి సంవత్సరం ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా అయ్యప్ప దీక్షకు సంబంధించిన సామాగ్రి, ప్రత్యేక భోజనం, రవాణా ఛార్జీలు వెరసి మాలధారణ రోజు నుంచి దీక్ష విరమించే వరకు జిల్లా వ్యాప్తంగా ఖర్చు రూ. 120 కోట్లు దాటుతున్నాయని భక్తుల అంచనా.

భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైలు

శబరిమలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం రైల్వేశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా నుంచి శబరిమలకు వెళ్లేందుకు ఇప్పటివరకు జయంతి ఎక్స్‌ప్రెస్ మాత్రమే ఉండేది. ఈ రైలులో వెళ్లేందుకు భక్తుల రద్దీ అధికంగా ఉండేది. ఈ విషయాన్ని గుర్తించిన రైల్వే అధికారులు హైదరాబాదు నుంచి జిల్లా మీదుగా ప్రత్యేక రైలును నడుపుతున్నారు.

వ్యక్తి అదృశ్యం

కడప అర్బన్: కడప నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కట్టకింద హరిజనవాడలో నివాసం వుంటూ కార్పెంటర్‌గా జీవనం సాగిస్తున్న రవిశంకర్ (40) గత వారం రోజుల నుంచి కనిపించలేదు. అతనికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారులు వున్నారు. శనివారం అతని భార్య పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ జయరాముడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు. ఆచూకీ తెలిసిన వారు సీఐ 9121100513, ఎస్ఐలు 9121100517, 9121100518లలో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

ప్రకాష్ నగర్‌లో అగ్నిప్రమాదం

కడప అర్బన్: కడప నగరంలోని ప్రకాష్‌నగర్‌లో శనివారం రాత్రి ఒక కారు బ్యాటరీ షార్ట్ సర్క్యూట్ వలన అగ్నిప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న వెంటనే సంఘటన స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకున్నారు. అగ్నిప్రమాదాన్ని నివారించారు. ఈ సంఘటనలో రెండు కార్లు పాక్షికంగా దగ్ధమయ్యాయి.

కాంగ్రెస్ కుంభకోణాల పార్టీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కాంగ్రెస్ పార్టీని కుంభకోణాల పార్టీగా పేర్కొనవచ్చని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధులు వీవీ చలపతి, పాలెం సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. కాంగ్రెస్‌కు చెందిన రాజ్యసభ సభ్యులు ధీరజ్‌సాహుపై గత మూడు రోజులుగా ఆదాయపు పన్నుశాఖ ఆధ్వర్యంలో జార్ఖండ్‌లోని అతని నివాసంలో ఒడిస్సాలోని మద్యానికి సంబంధించిన వ్యాపారాలపై నిర్వహించిన దాడుల్లో రూ. 300 కోట్లకు పైగా నగదు రూపంలో దొరికిందన్నారు. ప్రస్తుతం తెలంగాణాలో ఆచరణకు సాధ్యం కాని పథకాల అమలు ద్వారా రాష్ట్రం అధోగతిపాలు అవుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణరెడ్డి, రాష్ట్రకార్యదర్శి బాలకృష్ణ యాదవ్, యువమోర్చా జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్, రాష్ట్ర నాయకులు బత్తల పవన్‌కుమార్, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు కృషి



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ రాజా

కడప అర్బన్: అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు ప్రజలు సహకరించాలని కడప తాలూకా సీఐ పి. రాజా అన్నారు. శనివారం పల్లె నిద్ర కార్యక్రమాన్ని సీఐ చేపట్టారు. ఈమేరకు కడప తాలూకా పరిధిలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీఐ, తమ సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు, చెడు నడత కలిగిన వారి కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రాజీ మార్గం... రాజ మార్గం

కమలాపురం: కేసుల పరిష్కారంలో రాజీ మార్గం... రాజ మార్గం అని, లోక్ అదాలత్‌లో పైసా ఖర్చు లేకుండా కేసులు సత్వరం పరిష్కరించుకోవచ్చని కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లావణ్య తెలిపారు. శనివారం స్థానిక కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఇరువర్గాలు రాజీ ధోరణిలో ఉన్న 389 కేసులు పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. ఇందులో 378 క్రిమినల్, 8 సివిల్, 3 బ్యాంక్ కేసులు పరిష్కారం అయినట్లు వారు తెలిపారు. మెజిస్ట్రేట్ కక్షిదారులను చేతులు కలిపి రాజీ చేశారు.అనంతరం వారిని ఉద్దేశించి మెజిస్ట్రేట్ లావణ్య మాట్లాడుతూ రాజీ ధోరణిలో ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుంటే తర్వాత అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉండదన్నారు. న్యాయవాదులు పుష్పరాజు, మహేశ్వర్‌రెడ్డి, శ్రీనువాసులు, ఉదయ్, మహేష్, కోర్టు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రికెట్ ఎంపికలు ప్రారంభం



క్రికెట్ ఎంపికలను పరిశీలిస్తున్న ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అరుణ, సెలక్షన్ కమిటీ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో శనివారం ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి అండర్–14 బాలురు, అండర్–17 బాలబాలికల విభాగం ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యంత ఆదరణ ఉన్న క్రికెట్ ఎంపికలకు వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరుకావడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 12న నరసరావుపేటలో నిర్వహించే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంపికలు నిర్వహించి జిల్లా జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో క్రికెట్ సెలక్షన్ కమిటీ సభ్యులు దిలీప్ చక్రవర్తి, బాలశేఖర్, సుబ్బయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పద్మావతి, వెంకటలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎంపికల్లో గందరగోళం..

క్రికెట్ ఎంపికలకు సంబంధించిన సమాచారాన్ని క్రీడాకారులకు తెలియకపోవడంతో గతంతో పోలిస్తే తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. ఎంపికల ప్రక్రియలో సైతం సెలక్షన్ కమిటీ సరిగా వ్యవహరించలేదని పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు వాగ్వాదానికి దిగారు. ప్రతిరోజూ స్టేడియంకు వచ్చి సాధన చేస్తున్న క్రీడాకారులను పక్కన పెట్టడం సరికాదంటూ ప్రశ్నించారు. ఎంపికల ప్రక్రియలో తలెత్తిన గందరగోళంపై ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అరుణకుమారిని వివరణ కోరగా.. బాగా ఆడే క్రీడాకారుల మధ్య పోటీ వచ్చినప్పుడు ఇలాంటి సమస్యలు వస్తున్నాయని, ఎంపికల ప్రక్రియ పారదర్శకంగానే జరుగుతోందని పేర్కొన్నారు. మంచి జట్టునే జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

ఆక్రమణల తొలగింపు



కృష్ణా థియేటర్ వద్ద ఆక్రమణలు తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

కడప కార్పొరేషన్: కడప నగరంలో కృష్ణా థియేటర్ వద్ద నగరపాలక టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణా థియేటర్ ప్రహరీను జేసీబీ సాయంతో కూల్చివేశారు. థియేటర్ ఆవరణలోంచి డ్రైనేజీ కాలువ నిర్మాణానికి గుంతలు తీశారు. అలాగే చుట్టుపక్కల ఉన్న ఆక్రమణలను కూడా తొలగించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర ఆధ్వర్యంలో ఈ ఆక్రమణలు తొలగించారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మృతదేహాలు

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో రెండు గుర్తు తెలియని పురుష మృతదేహాలున్నాయి. ఈ మృతదేహాల వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని కడప రిమ్స్ ఆర్‌ఎంఓ డాక్టర్ వై. శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మురుగునీటి శుద్ధి వాహనాల పంపిణీ



వాహనాన్ని లబ్ధిదారుడికి అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని స్వచ్ఛత ఉద్యమి యోజన పథకంలో భాగంగా కడప మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులకు మురుగునీటి శుద్ధి వాహనాలను అందజేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వైఎస్సార్ జిల్లాకు స్వచ్ఛత ఉద్యమి యోజన పథకం ద్వారా రూ.2.53 కోట్ల విలువ చేయు ఎనిమిది వాహనాలను మంజూరు చేసింది. ఈ వాహనాలను శనివారం కడపలోని జెడ్పీ కార్యాలయ ఆవరణలో లబ్ధిదారులకు ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, కలెక్టర్ విజయ్ రామరాజు, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అందజేశారు. ఒక్కో వాహనం రూ. 31.67 లక్షలు కాగా, అందులో ప్రభుత్వం రూ. 15.06 లక్షలు సబ్సిడీపోను ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ రుణం రూ. 16.60 లబ్ధిదారులు 72 వాయిదాలలో చెల్లించాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, ఎస్సీ కార్పొరేషన్ సంచాలకులు డాక్టర్ వెంకట సుబ్బయ్య, ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసులు, నగర డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం, కార్పొరేటర్ షేక్ మహమ్మద్ షఫీ, నాయకులు జమాల్ బాషా పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ జగనన్న లక్ష్యం



మాట్లాడుతున్న వైద్య విభాగం జోనల్ అధ్యక్షుడు డాక్టర్ వారణాసి ప్రతాప్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ జగనన్న లక్ష్యమని వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జోనల్ ఇన్‌చార్జి వారణాసి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2019లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆరోగ్య శ్రీకి కొన్ని వేల కోట్లు ఖర్చుపెడుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. రాష్ట్రంలో నూతన మెడికల్ కాలేజీలు, విలేజ్ క్లినిక్‌లు, సచివాలయ వ్యవస్థ ద్వారా ఎంతో మందికి ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. ఆరోగ్య శ్రీ లో గతంలో రెండు లక్షల యాభై వేలు ఉన్న పరిమితిని ముఖ్యమంత్రి ఇరవై ఐదు లక్షల వరకు పెంచడంతో ఎంతో మంది దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు ఖరీదైన వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శివా నాయక్ మాట్లాడుతూ దేశంలో ఎన్నడూ లేని విధంగా 108, 104, సురక్ష వాహనాలు ఏర్పాటు చేసి పేదలకు ఉచిత వైద్యాన్ని వారి ఇంటి వద్దనే అందేలా చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రతి ఇంటికీ నూతన ఆరోగ్యశ్రీ కార్డులు అందించేందుకు ఈ నెల 25 నుంచి ప్రత్యేక కార్యక్రమాలు సచివాలయాల పరిధిలో జరగనున్నాయన్నారు. త్వరలో రిమ్స్‌లో మానసిక వైద్యశాల, కేన్సర్ హాస్పిటల్ ప్రారంభం కానున్నాయన్నారు. తద్వారా సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు డాక్టర్ సతీష్ రెడ్డి, ఉపాధ్యక్షుడు డాక్టర్ పవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన దేవతామూర్తుల వేషధారణలు

బద్వేలు అర్బన్ : పట్టణంలో అయ్యప్ప స్వామి గ్రామోత్సవం శనివారం వైభవంగా జరిగింది. తెలుగు గంగ కాలనీ సమీపంలో ఉన్న దత్తసాయి బాబా ఆలయ ప్రాంగణంలో వెలసిన అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత అయ్యప్పస్వామి ఉత్సవమూర్తికి పూజలు నిర్వహించి అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామివారిని కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపారు. దేవతామూర్తుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో అయ్యప్పస్వామి ఆలయ గౌరవాధ్యక్షులు భూమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా బిందెసేవ



బిందెసేవలో రామేశ్వరం పద్మశాలీయ బహుత్తమ సంఘం నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని శ్రీ భద్రావతి భావన్నారాయణ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను పద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం భద్రవతి భావన్నారాయణ స్వామివారికి విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. మూల మంత్రహోమం, జపపారాయణ తదితర పూజాకార్యక్రమాలు వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిగాయి. హనుమత్ లింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి, అమ్మవారిని కలశాలలోకి ఆవాహన చేసి బిందె సేవ మహోత్సవం చేపట్టారు. కార్యక్రమంలో పద్మశాలీయ బహుత్తమ సంఘం అధ్యక్షుడు మేరువ పెంచలయ్య, ప్రధాన కార్యదర్శి సోము జానకిరామయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడు నందం లక్ష్మణకుమార్, కోశాధికారి గునిశెట్టి సురేష్‌బాబు, నందం రామయ్య పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల అభివృద్ధిలో భాగస్వాములవుతాం



పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులతో ప్రిన్సిపాల్ తదితరులు

వైవీయూ : కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాల అభివృద్ధిలో తామూ భాగస్వాములవుతామని పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. శనివారం కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో కళాశాల ఏర్పాటై 75 సంవత్సరాలు అయిన సందర్భంగా వజ్రోత్సవాలు నిర్వహించ తలపెట్టిన నేపథ్యంలో పూర్వ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. రవీంద్రనాథ్ మాట్లాడుతూ కళాశాలలో చదువుకున్న వారెందరో గొప్పగొప్ప స్థానాల్లో ఉన్నారని, వారందరూ సహకారం అందించడంతో పాటు సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆకాంక్షించారు. కళాశాల అభివృద్ధి మండలి సభ్యులు లయన్ కె. చిన్నపరెడ్డి, పోతుల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధి కార్యక్రమాలు ఇప్పటికే చేపట్టామని, కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు శివరాం, రవికుమార్, గునిశెట్టి శ్రీనివాసులు, నాగరాజు, రామకృష్ణ, కృష్ణవేణి, లీలావర్ధిని, రాజశేఖర్, గురుమోహన్‌రెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కడప కార్పొరేషన్: కమలాపురం నియోజకవర్గ పరిధిలోని చెన్నూరు కొండపేటలో ఆదివారం మధ్యాహ్నం నిర్వహించే సామాజిక సాధికార బస్సుయాత్ర జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ కోరారు. శనివారం కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా బస్సుయాత్ర పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలోనే సామాజిక న్యాయం జరిగిందని అన్నారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో కమలాపురం నియోజకవర్గం అంచెలంచెలుగా అభివృద్ధి చెందిందన్నారు. ఇంతకు పదింతలు అభివృద్ధి జరగాలంటే జగనన్న మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శ్యాంసన్, సీహెచ్ సునీల్, లారెన్స్, జ్యోతి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



బస్సుయాత్ర పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి